# నీకో నీతి నాకో నీతి

కందుకూరి వెంకట మహాలక్ష్మి

"ఛీ...ఛీ... లే...లేలే... కొట్టండిరా! వెధవ కుక్కనీ. ఏరా రంగడూ! ఎక్కడున్నావురా? ఎన్నిసార్లు చెప్పాను! ఈ చెత్తకుక్కని లోపలికి రానివ్వ వద్దని!"

"పో... పో... పోయే..."

"అసలా కన్నమ్మకి బుద్ధిలేదు. ఈ ఊరకుక్కని పెంచమని ఎవరు చెప్పారు? ఏదో బీదముండని ఇల్లిస్తే తాను కాక పిల్లీ అన్నట్లు ఆ వెధవకుక్కని కూడా ఇంట్లోకి తెస్తుందా? ఏదీ ఆ ముండనిలా రమ్మను"

"ఏమండమ్మా! పిల్చారంటా"

"పిల్చారటా... అంటూ నంగనాచిలా అడుగుతున్నావేమిటే? ఎందుకు పిల్చానో నీ కొడుకు చెప్పలేదూ?"

"చెప్పేడంమ్మా! దాన్ని నేను తెచ్చి పెంచలేదండమ్మా! దాని తల్లి పిల్లల్ని కన్నాక ఓ దొరబాబు కారు కిందపడి సచ్చిపోనాదండీ! ఆ తరువాత పిల్లలు నాలుగుమూలలకీ సెదిరిపోనాయి.

ఈ కుక్క ఏడుస్తూ వస్తే పిల్లోడు, నేను తినగా మిగిలిన గంజి మెతుకులు పెట్టేవాళ్ళం. అదలా అలవాటయి నన్నొగ్గటంలేదండమ్మా! అప్పటి నుంచీ నేను లేకపోయినా నా యింటి ముందు పడుండీ పిల్లాడినీ, ఇంటినీ కాపలా కాస్తోందండీ! నాలుగేళ్ళుగా మాతోటే వుంటోందండమ్మా! ఇయాళ దాన్నెలా తరిమెయ్యను తల్లీ! తరిమినా మళ్ళీ ఒచ్చేత్తుందమ్మా, ఏం చెయ్యమంటారూ?"

"చూడూ... నీ వెధవ లెక్చర్లు వినడానికి కాదు నిన్ను పిలుస్త. నీ ఊరకుక్క నా రాణీ దగ్గరకొస్తోంది. నీ కుక్క రోగాలు నా రాణీకంటుకుంటాయి. దానికి రోడ్డుమీద ఊరకుక్కలే దొరకలేదా? నా రాణీకోసం జాతికుక్కని తీసుకొస్తున్నాం. ఆ వీధికుక్కలవల్ల నా రాణీకి పిల్లలు పుట్టడం మాకిష్టంలేదు. నీకూ, మాకూ మధ్య ఎంత తేడా వుందో... నీ కుక్కకీ మా కుక్కకీ మధ్య కూడా అంతే! తెలుసుకుని యికనుంచి ఆ వెధవ కుక్కని అదుపులో పెట్టుకో... నీకు దానిమీద అంత మమకారం పెరిగిపోతే నీ ఇంట్లో కట్టుకో. ఇదే ఆఖరిసారి చెప్పేది. ఈసారింక మాటలతో కాదు. ఇంకనీ కుక్క నా కాంపౌండ్‌లోకి వచ్చిందంటే తిన్నగా తీసుకెళ్ళి చంపించేస్తాను. అర్థమయిందా! వెళ్ళు" అంటూ లోపలికెళ్ళిపోయింది హైమావతమ్మగారు.

జమిందారీలు పోయినా జమిందారులకంటే ఎక్కువ హోదాతో విర్రవీగుతోంది ఆ వీధిలోని పాపారావుగారి మూడంతస్తుల భవనం. ఇప్పటికీ ఆయన పేరు జమిందారు పాపారావు గారే. ఇటీవలే ఆయన దేశసేవకుడిగా కూడా పోటీచేసి నెగ్గారు.

ఆయన సతీమణి హైమవతిగారు. కొడుకులిద్దర్నీ అమెరికా చదువులకి పంపి, ఆ దంపతులిద్దరూ ఓ కుక్క పిల్లని పెంచుకుంటున్నారు. ఆడపిల్లలులేని లోటు తీర్చుకోడానికి.

'కోట్లకి పడగెత్తినవారు కూటికి ముఖం వాస్తా'రన్న నానుడి వీరికి సరిగ్గా వర్తిస్తుంది. అయ్యగారికి గ్యాస్, అజీర్ణ రోగాలు, అమ్మగారికి బి.పి, షుగరూ, దాంతో నాలుగు రుచులేకాదు, కడుపునిండా అన్నంతినే అదృష్టాన్ని కూడా కోల్పోయారా దంపతులు.

'ఏనాడు చేసుకున్న పాపమో ఇలా చప్పిడికూడు తింటున్నాం' అంటూ బాధపడిపోతూనే, ఈ జన్మలో కూడా ఎంగిలి కంచంలో ఈగని వాలనివ్వదా ఇల్లాలు. ఈ జన్మలోది, ఈ జన్మలోనే అనుభవిస్తున్నాం' అన్న నిజాన్నింకా గుర్తించక.

పొరపాటున ఎవరికైనా ఓపైసా ధర్మం చేస్తే అడిగిన వారికీ, అడగని వారికీ తమ దాతృత్వం గురించి చెప్తూ ఊరంతా తెలిసేలా మరీ చేస్తారా హైమవతిగారు.

కన్నమ్మ ఒకానొకప్పుడు మర్యాదగా, గుట్టుగా బ్రతికిన మనిషే! నెలకి వెయ్యి రూపాయలదాకా గడించుకునే భర్త పోవడంతో ఎనిమిదేళ్ళ కొడుకుతో పొట్టకోసం వీధినపడి పాపారావు గారింట్లో పనిక్కుదిరింది. అంట్లు తోమి, బట్టలుతికి, ఇల్లు ఊడ్చినందుకు తమ ఇంటివెనకగా వున్న పాడుపడ్డ ఓ గది యిచ్చి, వంద రూపాయ లిస్తున్నారు. దీనికిగాను వప్పుకున్నపనే కాకుండారోజల్లా ఏదో వెట్టి చాకిరీ చేయించుకుంటూనే వుంటుంది హైమావతిగారు.

వాళ్ళిచ్చే వందరూపాయలతో యిద్దరి తిండికీ చాలక అవస్తపడుతున్నా కన్నమ్మకి వేరే యిల్లు పనిచేసుకునే టైముండేదికాదు. కొడుక్కి రెండు అక్షరం ముక్కలు రావాలన్న ఉద్దేశ్యంతో, గవర్నమెంటు బడికి రంగడిని పంపించేది.

అది చూసి సహించలేని హైమావతిగారు రంగడికి కూడా ఏవో పన్లు పురమాయించి వీలయినన్ని రోజులు వాడిని స్కూలుకి వెళ్ళనివ్వకుండా చేసేది. కానీ ఇంటికొచ్చిన ప్రతీవారికీ మాత్రం కన్నమ్మ దీనగాథ మనసు ద్రవించేలా చెప్పి, తను యిల్లిచ్చి తల్లీ, పిల్లాడినీ ఎంతలా ఆదుకున్నదీ చెప్పి జాలిపడేది.

తల్లి సుస్తీగా వున్నట్లు వచ్చిన టెలిగ్రాము అందుకుని గంటలమీద ప్రయాణమయి వెళ్ళింది హైమావతిగారు. దాంతో వంటపనికూడా కన్నమ్మ నెత్తినేపడింది. రోజల్లా పాపారావుగారింట్లోనే వుండి, దేశసేవ పేరిట ఊరంతా తిరిగి ఏదో టైములకి వచ్చే పాపారావుగార్కి అన్నంపెట్టి రాత్రి ఏ పన్నెండింటికో తన గదికి చేరి పిల్లాడికి అన్నం పెట్టుకునేది కన్నమ్మ.

వంటింటి ముందు కునికిపాట్లుపడుతున్న కన్నమ్మ, పాపారావుగారి గర్జనతో ఉలిక్కిపడిలేచి గబగబా బల్లమీద అన్నీ సర్ది వడ్డించసాగింది.

## బంధం

పెంచుకుంటే బంధం
వాడిపోని గంధం
తరిలిపోని వసంతం
అనురాగ ఆదర్శ
అక్షయ తరంగం
మమతానురాగాలు
పల్లవించే, గీతం
ఆత్మీయ అనుబంధ
భావాల జీవం
ఆలాపన స్వరాల్లో
నిండిన ప్రేమ శిల్పం
లాలిత్య పదాల్లో
చేతనత్వ కవిత్వం
అనురాగపు మబ్బులన్ని
శశిని కప్పు ప్రేమత్వం
వసంతాన చిగుర్చునట్టి
వృక్ష హర్షనాదం
గుండెలోన మోయలేని
బరువుదించు సాంగత్యం
ఉగాదైన షడుచిలో
తీపాకటే మిగిల్చేటి పర్వం
కొమ్మ కొమ్మకు, రెమ్మరెమ్మకు ప్రాణమై గాలి
అందించు స్నేహ హస్తం
అందరానివేళ...?
ప్రేమలేని వేళ...?
అలమటించు హృదయాన
అశ్రువులే నయనాన
పెంచుకుంటే బంధం వాడిపోని గంధం
తుంచుకుంటే, మాడ్చు
అది అగ్ని గుండం

**సిరిసిల్లా గఫూర్ శిక్షక్**

కంచంముందు కూర్చున్న పారావుగారు కంచంవైపు చూడటంలేదు. బల్లదగ్గర నిలబడి వడ్డిస్తున్న కన్నమ్మవైపే రెప్పవెయ్యకుండా చూస్తూ, ఆమె యౌవ్వనాన్ని తాగి, కైపెక్కిన కళ్ళతో జుర్రుకోసాగాడు.

చిరిగిన చీర, రవిక కన్నమ్మ పాతికేళ్ళ యౌవ్వనాన్ని దాచలేకపోతున్నాయి. మనిషి చామనచాయగా వున్నా, బట్టలు మురికిగావున్నా, జుట్టుకి తగిన తైల సంస్కారం లేకపోయినా వాటిని కప్పెట్టేస్తోంది ఆమె వయసు పొంగు.

కంచంలో చెయ్యి కడుక్కుని తుడుచుకుంటూ లేచిన పాపారావు కన్నమ్మని పిల్చి, వెళ్ళేముందు మరచెంబూ నీళ్ళూ పడగ్గదిలో పెట్టి వెళ్ళమని ఆదేసించి పడగ్గదిలోకి వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

''దిక్కుమాలిన ముండా! మళ్ళీ తగలడ్డావుంటే'' అంటూ పనివాడిని పిల్చి, కన్నమ్మ కుక్కని చావకొట్టించ డమే కాకుండా, గంటలమీద కుక్కల్ని పట్టే వాళ్ళని చాటుగా పిలిపించి మందో మాకో ఇచ్చి ఈ కుక్కని చంపెయ్యమని ఆదేసించింది హైమావతిగారు.

కుక్కలబండిలోకి ఎక్కనంటూ గింజుకుంటూ పెట్టిన గోలకి, ఏడ్చిన ఏడుపుకి కన్నమ్మ, పిల్లాడు కళ్ళనీళ్ళెట్టుకుని బాధపడసాగారే తప్ప, యజమానురాల్ని ధిక్కరించి దాన్ని విడిపించుకోలేకపోయారు.

అంటరానికుక్క బెడద జమిందారుగారి భార్యకి అంతటితో వదిలిపోయింది. కానీ చిన్న జాతిదీ దాసీదీ అని మాటి మాటికీ అనే కన్నమ్మ కడుపులో పెరుగుతున్న బిడ్డకి తండ్రిమాత్రం పెద్దజాతివారే!! అన్న సంగతి కన్నమ్మ తన నోటెంట చెప్పలేకపోయినా, గడుస్తున్న నెలలు కన్నమ్మ ఆకారాన్నే మార్చి చెప్పకనే చెప్పాయి. హైమావతమ్మగారే కాదు, జమిందారు పాపారావు గారు కూడా ఈ విషయం గ్రహించకపోలేదు.

పని పూర్తి చేసుకుని గదిలోకి వెళ్ళిన కన్నమ్మ ఉదయం పనిలోకి రాకపోయేసరికి చూడ్డానికి వెళ్ళింది హైమా వతిగారు.

కన్నమ్మ నురుగులు కక్కుకుంటూ, గుడ్లు తేలేస్తోంది, పిల్లాడు పక్కని గోలపెడుతున్నాడు.

''అయ్యో! పాపం ఏమయ్యిందీ!'' అంటూ వెళ్ళి చూసి, రిక్షామీద ప్రభుత్వాసుపత్రికి బంట్రోతుని తోడిచ్చి పంపింది హైమావతమ్మగారు.

ఆసుపత్రికి చేరేసరికే కన్నమ్మ ప్రాణం పోయిందని డాక్టర్ చెప్పాడు. నిట్టూర్పులు విడుస్తూ, జాలిపడటమే కాకుండా, కన్నమ్మ విషయం అడిగినవారితోనూ, అడగని వారితోనూ తను ఊళ్ళో లేనప్పుడు పనివాళ్ళతో తిరిగి నెలతప్పిందనీ, తను నిలదీసి అడిగి, చివాట్లేసేసరికి ఆత్మ హత్య చేసుకుందనీ, 'చిన్నజాతివాళ్ళు చిన్నజాతి వాళ్ళే నండీ! వాళ్ళ కుక్కబుద్దిపోదు' అంటూ అందరికీ చెప్పడమే కాకుండా రెండు పూటలా పెట్టే ఎంగిలి కూటికి కన్నమ్మ కొడుకుని చదువుమాన్పించి, శక్తికి మించిన చాకిరీ చేయించుకుంటూ, ఊరంతా మాత్రం 'మేం గనక దిక్కు లేని ఆ కుర్రవెధవని ఆదుకుని కొడుకులా చూసుకుంటు న్నాం. మరొకళ్ళయితే పొమ్మందురు. పొమ్మంటే ఏ రోడ్డు మీదో అడుక్కుంటూ వుండేవాడు. అలా చెయ్యలేక ఏ పనీ చెయ్యలేకపోయినా పొమ్మనలేకపోతున్నాం' అంటూ అందరి హృదయాలూ కరిగించేలా, ఇంతని అంత చేసి మరీ చెపుతోంది.

హైమావతమ్మగారు నగలతో యిరుక్కుపోయిన మెడని అటూ, ఇటూ తిప్పుకుంటూ ఆమె మాటల్ని వినీ వినీ విసిగిపోయిన బంట్రోతు రామయ్య మాత్రం ఊర కుక్కతో పెద్దవాళ్ళని పోల్చి చూసుకుని అనుకున్నాడు.

'ఊరకుక్క జాతికుక్క దగ్గరికి వచ్చిన దానికి ఫలితం? దాన్ని కుక్కల్ని పట్టేవాళ్ళకి అప్పగించి చంపించడం! మరి గొప్పజాతని చెప్పుకునే జమిందార్లూ, పెద్దమనుష్యులూ, పేరున్న వ్యక్తులూ, దేశసేవాపరులూ, కూటికోసం తనింట చాకిరీ చేస్తున్న ఒక బీదరాల్ని కామంతో కాటేసి, నాశనంచేసి పైగా ఆ మనిషికి వేసిన శిక్ష?? హత్య!! తను చేసిన తప్పు పని బైటికిరాకుండా కప్పెట్టుకోడానికి, ఆమెకి సాయంత్రం కాఫీలో విషం కలిపిచ్చి, చంపి తమ పరువు మర్యాదలకి భంగంరాకుండా కాపాడుకున్నారు. గొప్పవారి కత్తికి రెండువైపులా పదునే!!

కుక్కకి నిర్దేశించిన నీతి గొప్పవారికి అక్కరలేదన్న మాట! డబ్బూ, పదవులూ వున్న ఇలాంటి వ్యక్తులకన్నా, విశ్వాసంగా పడుండే ఆ ఊరకుక్కే వెయ్యిరెట్లు నయం కాదా?! అదే బ్రతికివుంటే ఆరోజు కన్నమ్మకి అన్యాయం జరుగుతున్నప్పుడు ఈ జమిందారుని చీల్చి చెండాడ కుండా వుండేదా? ఛీ... ఛీ... థూ'' అంటూ కాండ్రించి ఉమ్మేసి...

''రా రా రంగడూ! నాకు మరో కొడుకున్నాడని నిన్నూ పెంచుకుంటాను, రెక్కాడించుకునే మనకి ఎక్కడో ఓ చోట డొక్కనిండకపోదు'' అంటూ మనసులో అను కుని, పేడెత్తుతున్న రంగడిరెక్కపట్టుకుని లాక్కెళుతుంటే ఏమీ అర్థంకాని రంగడు అమాయకంగా మూగ రామయ్య వెనక నడవసాగాడు. ■